సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 24 । అక్టోబర్ । 2024



అంపశయ్యపై పేదవాడి బీమా

ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏ) ఈ నెల ఒకటిన బీమా రంగంలో పెనుమార్పులు తెచ్చింది. ఇవి ఎల్‌ఐసీపై ఆధారపడిన ఏజెంట్ల కడుపుకొట్టేలా ఉన్నాయి.


8 లో



భక్త కోటి పులకింత

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి బుధవారం కోదండ రాముని అలంకరణలో హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

39 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 39,347 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9 వేల క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

సెజ్ మృతుడి కుటుంబానికి అండగా వైఎస్సార్ సీపీ

రూ.5 లక్షల చెక్కు అందజేత



మృతుడి భార్య నాగమణికి చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: అచ్యుతాపురం సెజ్ పేలుడులో మృతి చెందిన పాశర్లపూడిలంకకు చెందిన మారిశెట్టి సతీష్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా నిలిచింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనకు అనుగుణంగా పేలుడులో మృతి చెందిన సతీష్ కుటుంబానికి పార్టీ తరఫున రూ.5 లక్షల చెక్కును జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి బుధవారం అందజేశారు. మృతుడి భార్య నాగమణికి ఈ చెక్కును అందించారు. ఈ సందర్భంగా సతీష్ చిత్రపటానికి వేణుగోపాలరావు, రాజేశ్వరీదేవి నివాళులర్పించారు. మృతుడి భార్య నాగమణి, తండ్రి శ్రీనివాసు, తల్లి పద్మావతిని వారు పరామర్శించారు. తమ పార్టీ పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు కొమ్ముల రాము, నక్కా వెంకటేశ్వరరావు, కుడుపూడి విద్యాసాగర్, నాయకులు నీతిపూడి గణేష్‌బాబు, తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, గెద్దం వెంకటేశ్వరరావు, బాలం రమేష్, తేతల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇవేమి చదువులో..!

- 'నన్నయ' ఎగ్జామినర్ విస్మయం
- కళాశాలలో ఆకస్మిక తనిఖీ


మలికిపురం: వివాదాస్పంగా ఉన్న మలికిపురం ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అందుతున్న బోధన విధానాలపై నన్నయ యూనివర్సిటీ ఎగ్జామినర్ మట్టా రెడ్డి విస్మయం చెందారు. గత కొంత కాలంగా అధ్యాపకులు దీక్షలు చేస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రహస్యంగా క్లాసులలోనికి వెళ్లిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల యాజమాన్యం తరఫున కొందరు సిబ్బంది వచ్చి.. పాఠాలు బాగా చెబుతున్నారని విద్యార్థులతో చెప్పించడంతో మట్టా రెడ్డి విస్మయం చెందారు. అలాగే యూనివర్సిటీ రిజిస్ట్రా ర్ సుధాకర్ కూడా విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ, విచారణ నివేదిక త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

వంతెన పనులు వేగవంతం చేయండి

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదిపై రూ.49.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనులను పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. వరద ప్రవాహం తగ్గిన నేపథ్యంలో అప్రోచ్ రోడ్డు మట్టి పనులను, పిల్లర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టు సంస్థకు సూచించారు. ఇంతవరకూ జరిగిన పనులను ఈఈ రామకృష్ణ రెడ్డి, డీఈఈ అన్యం రాంబాబు ఎస్ఈకి వివరించారు. పనులపై ఎస్ఈ శ్రీనివాస్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతవరకూ చేసిన పనులకు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్టు సంస్థ అధినేత పీపీ రాజు ఎస్ఈని కోరారు.

కోనసీమే కీలకం

- నీటి సంఘాల్లో కొనసాగుతున్న హవా
- ఉమ్మడి 'తూర్పు'లో అతి పెద్దదైన గోదావరి ప్రాజెక్ట్ కమిటీ (జీపీసీ)
- మూడు జిల్లాల పరిధిలో విస్తరణ
- 14 డీసీలు, 83 డబ్ల్యూయూఏలు
- గతంలో చైర్మన్ పదవులు ఈ జిల్లా వారికే..
- ఈసారి కూడా కావాలని డిమాండ్
- ఎలక్షన్ పేరుతో సెలెక్షన్ విధానానికి కూటమి ప్రభుత్వం మొగ్గు
- తెరపైకి వస్తున్న పాత టీడీపీ ముఖాలు



సెంట్రల్ డెల్టా ప్రధాన పంట కాలువ



బొబ్బర్లంక-అమలాపురం కెనాల్‌పై కొత్తపేట మండలంలోని పలివెల లాకులు

నీటి సంఘాల ఎన్నికల నగరా మోగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి, ఏలేరు ప్రాజెక్టు కమిటీలతో పాటు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో పలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు నవంబరు 21 నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది. ప్రాజెక్టు కమిటీల్లో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ(జీపీసీ) అతి పెద్దది కాగా, జిల్లాల పునర్విభజన తర్వాత.. ప్రాజెక్టు కమిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కీలకంగా మారింది.

సాక్షి, అమలాపురం/ కొత్తపేట: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి, ఏలేరు కీలక ప్రాజెక్టు కమిటీలతో పాటు, మీడియం ప్రాజెక్టు పరిధిలో తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్, పంపా రిజర్వాయర్ ప్రాజెక్టు, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులున్నాయి. ఇవి కాకుండా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. గోదావరి ప్రాజెక్టు కమిటీ వ్యవస్థ అతి పెద్దది. దీని పరిధిలో 144 డబ్ల్యూయూఏలు, 25 డీసీలు ఉన్నాయి. అలాగే ఏలేరు ప్రాజెక్టు కమిటీ పరిధిలో 25 డబ్ల్యూయూఏలు, ఐదు డీసీలు ఉన్నాయి. వీటితో పాటు తొండంగి పంపింగ్ స్కీమ్, పంపా రిజర్వాయర్ ప్రాజెక్టు, సుబ్బారెడ్డి సాగర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. గోదావరి ప్రాజెక్టు కమిటీ పరిధిలో కోనసీమ జిల్లా కీలకంగా మారింది. జిల్లాల విభజనకు ముందు అమలాపురం డివిజన్ (కోనసీమ) పరిధిలో కేవలం సెంట్రల్ డెల్టా మాత్రమే ఉండేది. జిల్లా ఏర్పడిన తరువాత సెంట్రల్ డెల్టాతో పాటు, తూర్పు డెల్టా పరిధిలోకి మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలు వచ్చి చేరడంతో ప్రాజెక్టు కమిటీలో జిల్లా వాటా మరింత పెరిగింది. కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని గోదావరి ప్రాజెక్టు కమిటీలో ఉన్న 25 డీసీల్లో ఏకంగా 14 డీసీలు ఉన్నాయి. అలాగే 144 డబ్ల్యూయూఏల్లో 83 ఉండడం విశేషం. వీటిలో సెంట్రల్ డెల్టాలోని 16 మండలాల పరిధిలో మేజర్ ఇరిగేషన్ సిస్టం కింద 56 సాగు నీటి సంఘాలు, 9 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, తూర్పు డెల్టా పరిధిలో 27 డబ్ల్యూయూఏలు, 5 డీసీలు ఉన్నాయి.

ఆశావహుల ప్రయత్నాలు

ప్రాజెక్టు కమిటీలు కీలకంగా మారడంతో సహజంగానే చైర్మన్ పదవి తమకు కావాలని జిల్లాలో ప్రాజెక్టు కమిటీ ఆశావహులు అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఉమ్మడి జిల్లాలో ఉన్నప్పుడు సైతం చైర్మన్లుగా మండపేటకు చెందిన రెడ్డి బ్రాహ్మణ చౌదరి, మామిడికుదురు మండలం గోగన్నమఠానికి చెందిన భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ చైర్మన్లుగా చేశారు. ఇదే విధంగా ఈసారి కూడా ఈ జిల్లాకు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అవకాశం కల్పించాలని టీడీపీ, జనసేన పార్టీల్లో ఆశావహులు కోరుతున్నారు. గతంలో ప్రాజెక్టు కమిటీల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డీసీలుగా పనిచేసిన వారు ఇప్పటికే తమ ఎమ్మెల్యేలను కలిసి మనసులో కోరికను వారి ముందుంచారు. నీటి సంఘాలకు పేరుకే ఎన్నికల తప్ప, గ్రామసభ, ఏకగ్రీవం పేరుతో ఎంపిక ప్రక్రియ జరగనుందని సమాచారం. ఈ నేపథ్యంలో ఎలాగైనా గెలుస్తామనే ఉద్దేశంతో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవికి, నియోజకవర్గ స్థాయిలో డీసీ చైర్మన్లకు ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

నవంబర్ 21న ఎన్నికలు

జిల్లా పరిధిలోని సెంట్రల్ డెల్టాకు అమలాపురంలోను, తూర్పు డెల్టా పరిధిలో ఎన్నికలు కాకినాడ జిల్లా కాకినాడలో జరగనున్నాయి. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) కమిషనర్ ఈ నెల 21న ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయగా, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు ప్రతి మండలానికి నీటి వినియోగదారుల సంఘం పరిధిలో తహసీల్దార్/డిప్యూటీ తహసీల్దార్‌ను ఆథరైజ్డ్ అధికారిగా, ఆయకట్టు వివరాలు సరిచేసేందుకు ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్‌ని నియమించారు.

కీలక ఘట్టాలు

- ఈ నెల 31న ప్రాదేశిక నియోజకవర్గాల ప్రచురణ.
- నవంబరు 1, 2 తేదీల్లో ప్రాదేశిక నియోజకవర్గాల అభ్యంతరాల స్వీకరణ.
- నవంబరు 3న ప్రాదేశిక నియోజకవర్గాల అభ్యంతరాలపై నిర్ణయం. ప్రాదేశిక నియోజకవర్గాల తుది ప్రచురణ.
- నవంబరు ఆరు నుంచి పదో తేదీ వరకు భూ యాజమానుల ఓటరు జాబితా తయారీ.
- నవంబరు 11, 12 తేదీల్లో భూ యాజమాన్య ఓటరు జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ.
- నవంబరు 13న భూ యాజమానుల ఓటరు జాబితాల అభ్యంతరాలపై నిర్ణయం.
- నవంబరు 20న భూ యాజమానుల తుది ఓటరు జాబితా ప్రకటన. అదే రోజున ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి యాజమాన్య సంఘాలు, డిస్ట్రిబ్యూట రీ కమిటీ, ప్రాజెక్టు కమిటీల ఎన్నికల ప్రకటన.
- నవంబరు 21 నుంచి 23 వరకూ ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి యాజమాన్య సంఘాల పోలింగ్.
- నవంబరు 24 నుంచి 26 వరకూ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పోలింగ్.
- నవంబరు 27 నుంచి 29 వరకూ ప్రాజెక్టు కమిటీల పోలింగ్.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పర్యవేక్షణలో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఓటరు జాబితాలు తహసీల్దార్ కార్యాలయాల్లో సిద్ధమయ్యాయి. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి విడుదలైన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

– బి.శ్రీనివాసరావు, డీఈఈ అండ్ ఈఈ (ఎఫ్ఏసీ), ఇరిగేషన్ శాఖ, అమలాపురం

పచ్చ పీతల హేచరీకి స్థల పరిశీలన



చిర్రయానంలో హేచరీకి స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి తదితరులు

సాక్షి ఇంపాక్ట్

కాట్రేనికోన: చిర్రయానంలో పచ్చ పీతల(గ్రీన్ క్రాబ్) హేచరీకి అవసరమైన స్థలాన్ని బుధవారం అమలాపురం ఆర్డీఓ కె.మాధవి, మత్స్య శాఖ జేడీ ఎన్ శ్రీనివాస్ పరిశీలించారు. గతంలో చిర్రయానంలో పీతల హేచరీ నిర్మాణానికి ఎన్ఎఫ్‌డీబీ రూ.2.75 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇటీవల 'సాక్షి'లో పీతల సాగు.. ప్రోత్సహిస్తే బాగు.. శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో పీతల హేచరీకి సేకరించిన స్థలాన్ని పరిశీలించేందుకు ఆర్డీఓ, మత్స్య శాఖ జేడీ చిర్రయానం వచ్చారు. కాలభైరవ స్వామి ఆలయం సమీపంలో సర్వే నంబరు 1లో ఐదు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు వచ్చి, హేచరీ అందుబాటులోకి వస్తే పీతల చెరువుల రైతులతో పాటు, సముద్ర తీరం వెంబడి ఉన్న పత్ర భూములు, ఉప్పు నీటి కయ్యల్లో పీతల పెంపకం పెరుగుతుందని వారన్నారు. దీంతో మత్స్యకారులకు ఉపాధి మెరుగవుతుందన్నారు. పీతల సాగు చేస్తున్న పల్లం, నీళ్లరేవు, చిర్రయానం రైతులు చెన్నయ్‌లోని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్(ఆర్‌జీసీఏ) నుంచి పీతల సీడ్‌ను తెచ్చేవారన్నారు. హేచరీలో సీడ్(ఒక పీత పిల్ల) ధర రూ.12 ట్రాన్స్‌పోర్టు, ప్యాకింగ్ ఖర్చులు రూ.3 అదనంగా అయ్యేదన్నారు. ఎక్కువ దూరం ట్రాన్స్‌పోర్టు చేయడం వల్ల 50 శాతం పిల్లలే బతికేవని, సీడ్ చెరువుకు వచ్చేసరికి రూ.30 పడేదన్నారు. ఇక్కడ హేచరీ అందుబాటులోకి వస్తే రూ.12కే సీడ్ దొరుకుతుందని చెప్పారు. అలాగే సమయం ఆదాతో పాటు, పిల్లలు బతికే శాతం అధికంగా ఉంటుందని జేడీ శ్రీనివాస్ వివరించారు. పీతల సీడ్ బ్యాచ్‌కు 1.25 లక్షల చొప్పున, ఏడాదికి 8 బ్యాచ్‌ల్లో పది లక్షల ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఎకరాకు 500 పిల్లలతో సాగు చేస్తారన్నారు. స్థానిక రైతులతో పాటు, ఇతర ప్రాంతాల వారికీ సీడ్ సరఫరా చేయవచ్చన్నారు. వీరి వెంట తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, నాగిడి నాగేశ్వరరావు, వీఆర్ఓ వెంకటేశ్వరరావు ఉన్నారు.

రూ.10 లక్షల విలువైన వెండి కలశాల సమర్పణ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.10 లక్షల విలువ చేసే 10.50 కేజీల వెండి కలశాలను బహూకరించినట్టు దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం చక్రధర్‌రావు తెలిపారు. వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ కమిటీ మాజీ సభ్యులు వీటిని బహూకరించినట్టు చెప్పారు. వాటిని స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వెండి కలశాలను అందజేస్తున్న రుద్రరాజు రమేష్‌రాజు, కమిటీ సభ్యులు

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టి పోరాటం

- బలభద్రపురంలో నేతల పిలుపు
- ఇలపల్లిని ఆదర్శంగా తీసుకుందాం
- పార్టీ నేతలు వేణు, కన్నబాబు, రాజాకు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి సత్కారం



వైఎస్సార్ సీపీ నేతలు వేణు, కన్నబాబు, రాజాను సత్కరిస్తున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా పోరాడుదామని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని బలభద్రపురంలో ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆయనతో పాటు నూతనంగా నియమితులైన పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబుకు అభినందన సత్కార సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేణు మాట్లాడుతూ, బిక్కవోలు మండలం ఇళ్లపల్లి వైఎస్సార్ సీపీ సర్పంచ్ లొల్లం భద్రంపై కూటమి నాయకులు దాడి చేస్తుంటే, వారిపై అదే గ్రామానికి చెందిన ప్రజలు ఒక్కసారిగా తిరగబడి వారిని తరిమి కొట్టారని, ఆ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని పార్టీ శ్రేణులు ముందుకు సాగాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతూ 2027లో ఎన్నికలు వస్తాయంటున్నారని, ఈసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారని, అందుకు ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్త సమరోత్సాహంతో పనిచేయాలన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని, గెలిచినవారు సంక్షేమాన్ని అందించడం మరచి, వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని, ఇదే కొనసాగితే రానున్న తమ ప్రభుత్వంలో రెట్టింపు బదులివ్వాల్సి ఉంటుందన్నారు. ఇళ్లపల్లిలో దౌర్జన్యానికి ఎదురుతిరిగిన ప్రజలను ఆయన అభినందించారు. మరో ముఖ్య అతిథి గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మోసం చేయడంలో నంబర్ వన్ అని మరోసారి నిరూపించుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం మానేసి, వైఎస్సార్ సీపీ నాయకులను అణిచివేద్దామంటే తిరుగుబాటు తప్పదన్నారు. ఈ నాలుగు నెలల కాలంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళల కోసం ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అలాగే మహిళలకు రెండు తీర్మానాలను ఆయన ప్రవేశపెట్టారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, శ్రేణులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ నియోజకవర్గం పాలనపై 'తప్పు-ఒప్పుల చిట్టా అందరి లెక్కలు తేలుద్దాం' అనే పుస్తకం రూపొందించామన్నారు. కార్యకర్తపై జరుగుతున్న దౌర్జన్యాలను వాటిలో నమోదు చేస్తున్నామని, వీటిని ప్రతి కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మాజీ మంత్రులు వేణు, కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే రాజాను డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, పోతల ప్రసాద్‌రెడ్డి(బిక్కవోలు), నల్లా శ్రీనివాసరావు(రంగంపేట), గుత్తుల రమణ(పెదపూడి) తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి వెండి బిందె సమర్పణ




ఏసీ సత్యనారాయణకు వెండి బిందె అందజేస్తున్న దాత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి బుధవారం గొంది గ్రామానికి చెందిన జంపన సూర్యనారాయణ రాజు, ఆయన కుటుంబ సభ్యులు 1.21 కేజీల బరువున్న వెండి బిందె బహూకరించారు. ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు ఈ వెండి బిందెను అందజేశారు. దాతకు దేవస్థానం సిబ్బంది స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఇచ్చారు. ఆలయ అర్చకుడు పి.రామశేషాచార్యులు పాల్గొన్నారు.


హరిత బాట

కనుచూపు మేర పచ్చటి పొలాలు.. విశాలమైన రహదారిపై ఆహ్లాదకర ప్రయాణం అలా సాగుతుంటే.. గమ్యం చేరే వరకూ అందమైన ప్రకృతి దృశ్యాలు కనువిందు చేస్తాయి. మొన్నటి వరకూ సాధారణ జంక్షన్‌గా ఉన్న దేవరపల్లి ఇప్పుడు మూడు జాతీయ రహదార్లకు అనుసంధానమై కొత్తరూపును సంతరించుకోనుంది. ఇరువైపులా పొలాల మధ్యన నిర్మితమవుతున్న ఈ నేషనల్ హైవేతో.. ఉభయ తెలుగు రాష్ట్రాలకు దేవరపల్లి తలమానికం కానుంది. ఇప్పటికే రెండు హైవేల నిర్మాణం పూర్తి కాగా, మరొకటి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

- మూడు నెలల్లో పూర్తికానున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు
- ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి
- రూ.2,200 కోట్లు మంజూరు
- 162 కి.మీ. నాలుగు లైన్ల నిర్మాణం
- వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి
- ఇప్పటికే 65 శాతం పూర్తయిన వైనం
- వర్షాల కారణంగానే అడ్డంకులు



దేవరపల్లిలో ఏర్పాటు చేస్తున్న అవుటర్ రింగ్ రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్



ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే మ్యాప్



శరవేగంగా జరుగుతున్న ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

దేవరపల్లి: గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిని ఈ హైవే దేవరపల్లి-గోపాలపురం రోడ్డులోని డైమండ్ జంక్షన్‌కు రెండు కి.మీ. దూరంలో కలుస్తుంది. అక్కడ రెండు హైవేలు కలవకుండా ట్రమ్‌పుట్ నిర్మిస్తున్నారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు సుమారు 162 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.2,200 కోట్లు మంజూరు చేసింది. 2022 ఏప్రిల్‌లో పనులు చేపట్టారు. తుపాను, భారీ వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ హైవే పూర్తిగా పచ్చని పొలాల మధ్యన వెళుతోంది. ఎక్కడా గ్రామాలు కనిపించవు. నాలుగు వరుసలుగా నిర్మిస్తున్న ఈ రహదారికి సుమారు 1,100 ఎకరాలను ప్రభుత్వం సేకరించి, రైతులకు పరిహారం అందజేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సహకారంతో కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ నిర్మాణ పనులు చేపట్టింది. హైదరాబాద్‌కు చెందిన డెకెం సంస్థ టెండర్ దక్కించుకుని పనులు చేపట్టింది. మూడు ప్యాకేజీల్లో పనులు జరుగుతున్నాయి. తెలంగాణలో మాత్రం ఖమ్మం నుంచి రేచర్ల వరకు ఒకే ప్యాకేజీగా పనులు జరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు ప్యాకేజీల్లో పనులు జరుగుతున్నాయి.

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 72 కి.మీ.

గ్రీన్ ఫీల్డ్ హైవేను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 72 కి.మీ. పొడవున నిర్మిస్తున్నారు. దీనికోసం ప్రభుత్వం 1,100 ఎకరాలను రైతుల నుంచి సేకరించింది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించారు. పనులు ప్రారంభంలో రైతుల నుంచి కొంత వరకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, తర్వాత అన్నీ సర్దుకోవడంతో పనులు ప్రారంభించారు. హైవేకు ఇరువైపులా సర్వీసు రోడ్లు ఉండవు. డైరెక్ట్‌గా నాలుగు వరుసల రహదారి నిర్మిస్తారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో చింతలపూడి సమీపంలోని రేచర్ల వద్ద నుంచి హైవే పనులు ప్రారంభమవుతాయి. అక్కడి నుంచి టి.నర్సాపురం, వేపుగుంట, గుర్వాయగూడెం, బొర్రంపాలెం, మీదుగా జంగారెడ్డిగూడెం వద్ద మద్ది ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఎర్ర కాలువ మీదుగా కొయ్యలగూడెం మండలం రాజవరం, యర్రంపేట, దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయగూడెం, గోపాలపురం మండలం వాదాలకుంట, వెదుళ్లకుంట గ్రామాల మీదుగా, దేవరపల్లి వద్ద గుండుగొలను-కొవ్వూరు హైవేలో కలుస్తుంది. 72 కి.మీ. హైవే నిర్మాణానికి రూ.2,200 కోట్లు మంజూరయ్యాయి. జంగారెడ్డిగూడెం వద్ద పుట్లగట్లగూడెం-గుర్వాయగూడెం వద్ద జంక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. జంక్షన్‌కు 83 ఎకరాలను అధికారులు సేకరించారు. ఖమ్మం నుంచి దేవరపల్లి మధ్య ఎనిమిది టోల్‌ప్లాజాలు, 51 మైనర్, 9 మేజర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తున్నారు. హైవే నిర్మాణం వల్ల దేవరపల్లి-హైదరాబాద్ మధ్య దూరం సుమారు 50 కి.మీ. తగ్గుతుంది. రహదారి పూర్తిగా పొలాల మధ్య నుంచి వెళుతుంది. మలుపులు లేకుండా సమాంతరంగా ఉంటుంది. గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్-16)లో దేవరపల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే కలుస్తుంది. అక్కడ అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం(ట్రమ్‌పుట్) చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మూడు జాతీయ రహదారులు కలుస్తుండడంతో.. నూతన టెక్నాలజీతో అవుటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు కీలకం

మూడు నేషనల్ హైవేల వల్ల మెట్ట ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. పండించిన పంటలను దూర ప్రాంతాల్లోని మార్కెట్లకు రవాణా చేయడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. దేవరపల్లి మీదుగా మూడు ప్రధాన జాతీయ రహదారులు నిర్మించడం వల్ల రవాణా రంగం మెరుగైంది. ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలను ఇతర రాష్ట్రాలకు రవాణా చేసి, గిట్టుబాటు ధర పొందుతున్నారు. కొవ్వూరు-గుండుగొలను(ఎన్‌హెచ్-16), దేవరపల్లి-తల్లాడ (316డి) జాతీయ రహదారి, కొత్తగా ఖమ్మం నుంచి దేవరపల్లికి సుమారు 162 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుంది. జాతీయ రహదారుల వల్ల ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే భూముల ధరలు ఊహించని విధంగా పెరిగాయి. ఎకరం రూ.2 కోట్లకు పైగా పలుకుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి వల్ల జాతీయ రహదారుల నిర్మాణం శరవేగంగా జరిగాయి. పారిశ్రామికంగా ఈ ప్రాంతం గణనీయమైన అభివృద్ధి చెందుతుంది.

మూడు నెలల్లో పూర్తి చేస్తాం



ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తయ్యాయి. నిబంధనల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అధిక వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోంది. దీని వల్ల సకాలంలో నిర్మాణ పనులు పూర్తి కాలేదు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉంది. పలు ప్రాంతాల్లో ప్రజలు అండర్‌పాస్‌లు అడుగుతున్నారు. వీరి అభ్యర్థనను కూడా పరిగణనలోకి తీసుకుని కేంద్రానికి పంపించాం. 162 కి.మీ. రహదారి నిర్మాణం జరుగుతుంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల హైదరాబాద్‌కు సుమారు 70 నుంచి 100 కి.మీ. దూరం తగ్గుతుంది. కొయ్యలగూడెం, పొంగుటూరు ప్రాంతంలో భూసేకరణపై కోర్టు కేసులు నడుస్తున్నాయి. తీర్పు రిజర్వులో పెట్టి పది నెలలైంది. దీనివల్ల మూడు కి.మీ. రహదారి నిర్మాణం ఆగిపోయింది. వచ్చే ఏడాది ఫిబ్రవరికి నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

– సురేంద్రనాథ్, పీడీ, నేషనల్ హైవేస్, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

శ్రీకాంత్‌తో తండ్రి విశ్వరూప్ ములాఖత్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న పినిపే శ్రీకాంత్‌ను ఆయన తండ్రి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. ఒక హత్య కేసులో శ్రీకాంత్‌ను అరెస్టు చేసిన పోలీసులు ఈ నెల 22న అర్ధరాత్రి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. జైలులో ఉన్న తన కుమారుడిని విశ్వరూప్ లాయర్‌తో కలిసి ములాఖత్‌లో సుమారు అరగంట సేపు మాట్లాడారు.

హనుమాన్ ఆలయంలో హుండీ చోరీ

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక చోరీ జరిగింది. గ్రామంలోని రామాలయం, హనుమాన్ ఆలయాలు కలిపి ఉంటాయి. ఆ ఆలయాలకు సంబంధించి హుండీని దొంగలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆలయం ఇనుప చట్రం తలుపులు పగులగొట్టి, ఆలయంలోకి ప్రవేశించి, హుండీలోని డబ్బును కాజేశారు. హుండీలోని కరెన్సీ నోట్లు, చిల్లర నాణాలను తస్కరించారు. పగులగొట్టిన హుండీని ఆలయానికి సమపంలో పడేసి దొంగలు పరారయ్యారు. విజయ దశమి ముందు గ్రామంలోని కనకదుర్గ ఆలయంలో డిబ్బీని దొంగలు కొల్లగొట్టారు. ఒకే నెలలో గ్రామంలోని రెండు ఆలయాల్లో చోరీలు జరగడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అన్నవరం: జాతీయ రహదారిపై సత్యసాయి విద్యా విహార్ స్కూల్‌కు ఎదురుగా ఉన్న మామిడి తోటలో సుమారు 45 ఏళ్ల వ్యక్తి ఉరి వేసుకుని మరణించినట్టు ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు బుధవారం తెలిపారు. సంఘటన జరిగి మూడు రోజులై ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఉరి వేసుకునేందుకు పచ్చ రంగు చీరను వాడినట్టు చెప్పారు. మూడు రోజుల క్రితం గుండు గీయించుకున్నట్టుగా అతని తలను బట్టి తెలుస్తోంది. కాఫీ రంగు చొక్కా, తెల్ల రంగు బనియన్, లోపల బిస్కట్ రంగు నిక్కరు, పైన నీలం రంగు జీన్స్ ధరించి ఉన్నాడని వివరించారు. కుడి చేతికి కాషాయ రంగు తాడు ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు అన్నవరం ఎస్సై శ్రీహరిబాబుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అంపశయ్యపై పేదవాడి బీమా

ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్ సంస్థలను లబ్ధి చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోందని ఎల్‌ఐసీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ అనేక ప్రభుత్వ సంస్థలు ఒక్కొక్కటిగా తమ ఉనికిని కోల్పోతున్నాయని, ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేస్తోందని విమర్శిస్తున్నారు. అందులోభాగంగానే ఈ నెల ఒకటి నుంచి బీమా రంగంలో ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు.. దేశంలో అగ్రగామిగా ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ)ని నిర్వీర్యం చేసేలా ఉన్నాయంటూ మండిపడుతున్నారు..

- కేంద్రం పోకడలతో బీమా రంగానికి పెను సవాళ్లు
- ఎల్‌ఐసీ ఏజెంట్ల కడుపు కొడుతున్న కొత్త నిబంధనలు
- పెరిగిన ప్రీమియం రేట్లతో వినియోగదారులపై అదనపు భారం
- దేశీయ సంస్థను నిర్వీర్యం చేసేందుకు 'కార్పొరేట్' కుట్ర!



రాజమహేంద్రవరంలోని ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం



ఐఆర్‌డీఏ నిబంధనలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

అల్లవరం: ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏ) ఈ నెల ఒకటిన బీమా రంగంలో పెనుమార్పులు తెచ్చింది. ఇవి ఎల్‌ఐసీపై, ఆధారపడిన ఏజెంట్ల కడుపుకొట్టేలా ఉన్నాయని ఎల్‌ఐసీ సంఘ ప్రతినిధులు విమర్శిస్తున్నారు. ఈ నిబంధనలు ఏజెంట్లకే కాకుండా, పాలసీదారులపై అదనపు భారం మోపుతున్నాయంటున్నారు. రూ.లక్ష ఉండే కనీస బీమా రూ.రెండు లక్షలకు పెరిగింది, తాజా ప్రీమియం 8.5 శాతం వరకు పెంచారు. దీనికి జీఎస్టీ అదనం. ఇలా పాలసీదారుడిపై అదనపు భారం పెరిగిందని చెబుతున్నారు. ప్రీమియం పెరిగినా బోనస్ రేటు మాత్రం పెరగలేదు. దేశవ్యాప్తంగా ఉన్న 46 కోట్ల మంది పాలసీదారులపై తీవ్ర ప్రభావం పడనుందంటున్నారు. ఐఆర్‌డీఏ 2014లో ఎల్‌ఐసీ పాలసీలో పెను మార్పులు చేసింది. పాత పాలసీలను రద్దు చేసి, వాటి స్థానే కొత్తవి ప్రవేశపెట్టింది. వీటిపై పాలసీదారుల నుంచి భారీగా జీఎస్టీ వసూలు చేసింది. మళ్లీ పదేళ్ల తర్వాత అక్టోబర్ ఒకటిన ఎల్‌ఐసీని నిర్వీర్యం చేసే దిశగా మార్పులు చేసిందని వారు చెబుతున్నారు.

ఏజెంట్ల భవిష్యత్తు అగమ్యగోచరం

కాగా 1956లో ఎల్‌ఐసీ ఏర్పడినప్పటి నుంచి దానిపై ఆధారపడిన లక్షలాది మంది ఏజెంట్ల భవిష్యత్తు కొత్త నిబంధనలతో అగమ్యగోచరంగా మారిందని ఎల్‌ఐసీ ఏజెంట్ల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పాలసీ తీసుకున్న పాలసీదారుడు ఒక ఏడాది ముగిశాక, పాలసీని రద్దు చేసుకుంటే క్లా బ్యాక్ కమీషన్ పేరిట ఏజెంట్ నుంచి వసూలు చేసే నిబంధన తమ కష్టాన్ని దోచుకునేలా ఉందంటున్నారు. ఏజెంట్‌కు ఇచ్చే కమీషన్ 35 శాతం నుంచి 28 శాతానికి తగ్గించింది. ఎల్‌ఐసీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు కమీషన్ తగ్గించిన దాఖలాలే లేవు. బీమా తీసుకునే పాలసీదారుడి గరిష్ఠ వయస్సు 55 నుంచి 50 ఏళ్లకు తగ్గించింది. ఆయా నిబంధనలకు వ్యతిరేకంగా ఎల్‌ఐసీ ఏజెంట్లు 14 రోజులుగా 'నో బీటీసీ' పేరిట పోరాటం చేస్తున్నారు. ఎల్‌ఐసీని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోకుండా, పాలసీదారుల శ్రేయస్సు దృష్ట్యా ఏజెంట్లు పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు.

16 లక్షలకు పైగా పాలసీదారులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 11 బ్రాంచీల పరిధిలో 16 లక్షలకు పైగా పాలసీదారులు ఉన్నారు. సుమారు 9 వేల మంది ఎల్‌ఐసీ ఏజెంట్లు స్వయం ఉపాధి పొందుతున్నారు. కొత్తగా తీసుకొచ్చిన మార్పులకు వ్యతిరేకంగా ఏజెంట్లు తమ హక్కుల కోసం పోరాటం సాగిస్తున్నారు. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న సంస్థను కాపాడుకునేందుకు, పాలసీదారులకు మెరుగైన సేవలు లభ్యమయ్యేందుకు పోరాటం కొనసాగిస్తున్నారు. దేశవ్యాప్తంగా 79 ప్రైవేటు బీమా కంపెనీలున్నా, ఎల్‌ఐసీ ఎప్పుడూ అగ్రస్థానంలోనే ఉంది.

నిర్వీర్యం చేసేలా ఉన్నాయి



అక్టోబర్ ఒకటి నుంచి చేసిన కొత్త మార్పులు ఎల్‌ఐసీని నిర్వీర్యం చేసేలా ఉన్నాయి. ఏజెంట్లను దెబ్బ తీస్తే ఎల్‌ఐసీ తన ఉనికిని కోల్పోతుందని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా కొత్త మార్పులు చేసింది. వీటితో పాలసీదారులు, ఏజెంట్లు తీవ్రంగా నష్టపోతున్నారు. దేశానికి వెన్నుముకగా ఉన్న ఎల్‌ఐసీని కాపాడుకుంటూనే, మా హక్కులను సాధించుకోవడమే మా లక్ష్యం.

– సుందరనీడి శ్రీనివాసరావు, లియాఫీ అధ్యక్షుడు, అమలాపురం

పేదలకు బీమా దూరం



కొత్త మార్పులతో గరిష్ఠ వయస్సు తగ్గించడం వల్ల అందరికీ పాలసీ సాధ్యం కాకపోవచ్చు, కనీస బీమాను రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచారు. దీనివల్ల పేదలకు బీమా అందని పరిస్థితి. ఐఆర్‌డీఏ నిబంధనలు ఎల్‌ఐసీని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయి. దేశవ్యాప్తంగా పలు యూనియన్ల ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం.

– రావూరి ఉదయ భాస్కరరావు, లియాఫీ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్

నీళ్ల ట్యాంకు ఎక్కి యువకుడి హల్‌చల్

- ఇళ్లను ఖాళీ చేయించేందుకు యత్నించడంతో ఆందోళన
- పోలీసుల చొరవతో దిగివచ్చిన వైనం



ఏడిదలో వాటర్ ట్యాంకు పైకి ఎక్కిన యువకుడు

మండపేట: తమ ఇళ్లను ఖాళీ చేయిస్తే ఆత్మహత్యే శరణ్యమంటూ మండలంలోని ఏడిదలో ఓ యువకుడు వాటర్ ట్యాంకు ఎక్కి హల్‌చల్ చేశాడు. దీంతో గ్రామస్తులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసుల జోక్యంతో ఎట్టకేలకు యువకుడు కిందకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో పంచాయతీ చెరువు చుట్టూ దాదాపు 46 కుటుంబాలు తాటాకు, పెంకుటిళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న నామాల పురుషోత్తం గ్రామాభివృద్ధికి ఆ చెరువు చుట్టూ ఉద్యానవనం, వాకింగ్ ట్రాక్ నిర్మించడానికి సంకల్పించారు. చెరువు అభివృద్ధికి రూ.2.50 కోట్లు సొంత నిధులను కూడా ప్రకటించారని పంచాయతీ పాలకవర్గం తెలిపింది. ఈ క్రమంలో చెరువు చుట్టూ ఇళ్లు ఖాళీ చేయిస్తేనే పార్కు అభివృద్ధి జరుగుతుందని నాలుగు రోజుల క్రితం పంచాయతీ పాలకవర్గం అత్యవసర సమావేశం నిర్వహించి తీర్మానించిందరు. ఖాళీ చేసిన వారికి నష్టం జరగకుండా, గ్రామంలో దేవుడు కాలనీలో ఒకొక్కరికీ ఒకటిన్నర సెంట్లు వంతున ఇంటి స్థలంతో పాటు, ప్రభుత్వం ద్వారా హౌసింగ్ లోన్ కూడా ఇప్పిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వారికి నోటీసులు ఇచ్చి, ఖాళీ చేయాలని చెప్పారు. ఎప్పటి నుంచో ఉంటున్న ఇళ్లను వదిలి, ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం తమకు లేదని బాధితులు తేల్చిచెప్పారు. ఈలోగా అక్కడే ఉన్న ఓ యువకుడు వాటర్ టాంక్ ఎక్కి, ఆందోళన చేపట్టాడు. తాము ఎక్కడికీ వెళ్లేది లేదని, తమకు న్యాయం చేయాలంటూ తన డిమాండ్ వినిపించాడు. సమాచారం అందుకున్న ఎస్సై డి.సురేష్‌బాబు తన సిబ్బందితో ఏడిద చేరుకున్నారు. ఆ యువకుడితో చర్చించారు. న్యాయం చేయిస్తామని చెప్పడంతో అతడు దిగి వచ్చాడు. ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న తమను అర్ధంతరంగా ఖాళీ చేయించాలని చూడడం అన్యాయమని బాధితులు వాపోతున్నారు. మండపేట నుంచి ఏడిద, దుళ్ల రోడ్డు వరకూ రహదారికి ఇరువైపులా అన్నీ ఆక్రమణలేనని, వాటి జోలికి పోకుండా తమ ఇళ్లపై పడటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలు

కిర్లంపూడి: జగపతినగరం పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో సుమారు రూ.5 లక్షల అవకతవకలు జరిగినట్టు డీఆర్పీ కండి హరి తెలిపారు. జగపతినగరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అధ్యక్షతన బుధవారం గ్రామసభ జరిగింది. డీఆర్పీ హరి మాట్లాడుతూ, ఇప్పటి వరకు జరిగిన ఉపాధి పనులను ఈ నెల 18 నుంచి 23 వరకు పరిశీలించినట్టు చెప్పారు. మొక్కలు నాటడం, వాటి నిర్వహణలో లోపాలు, ఐదు పనుల్లో బిల్లుల కన్నా ఎక్కువ సొమ్ము చూపించడం, ఎం-బుక్కుల నిర్వహణలో జాప్యం, మస్తర్లలో దిద్దుబాట్లు వంటి లోపాలు వెలుగులోకి వచ్చాయన్నారు. రద్దు చేసిన జాబ్‌కార్డులు తిరిగి ఇవ్వటంతో పాటు, వంద రోజుల పని దినాలు కల్పించాలని ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు కోరారు. పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తున్న పలువురు మేట్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

శైవాగమ పండితుడు విశ్వనాథం కన్నుమూత



పూజ్యం విశ్వనాథం(ఫైల్)

అంబాజీపేట: గంగలకుర్రులోని ఉమా పార్వతీ సమేత చెన్న మల్లేశ్వర స్వామి ఆలయ అర్చకుడు పూజ్యం విశ్వనాథం (95) మంగళవారం రాత్రి అదే గ్రామంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య సీతామహాలక్ష్మి గతంలోనే కాలధర్మం చెందారు. కోనసీమలో ప్రముఖ శైవాగమ పండితుడిగా, ఆది శైవ శివాచార్య బిరుదాంకితులుగా ఆయన పేరుగాంచారు. ముఖ్యంగా శైవాగమ పరీక్షాధికారిగా పలుమార్లు వ్యవహరించారు. ప్రముఖ శివాలయలలో కల్యాణోత్సవాలను ఎన్నో ఏళ్ల పాటు నిర్వహించారు. ఎంతో మంది శిష్యులకు అర్చక విధానాన్ని బోధించారు. ఆయన మృతికి మండల ఆదిశైవ అర్చక సంఘం సంతాపం తెలిపింది.

29, 30 తేదీల్లో క్రీడాకారుల ఎంపికలు

అమలాపురం రూరల్: ఆంధ్ర ప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీష్ ఆదేశాల మేరకు అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు 2024-25కు సంబంధించిన రాష్ట్ర స్థాయి పోటీల షెడ్యూల్‌ను విడుదల చేసినట్టు కోనసీమ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయి ఎంపికలు ఈ నెల 29, 30 తేదీలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి అమలాపురం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ బాలయోగి స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఈ క్రీడా పోటీలు 19 క్రీడాంశాలలో నవంబర్ 6 నుంచి 9 వరకు విజయవాడ, మంగళగిరి, గుంటూరులో వివిధ క్రీడా ప్రాంగణాల్లో జరుగుతాయిని వివరించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 79933 29433 సంప్రదించాలని కోరారు.

అక్కు తైక్వాండో జట్టు ఎంపిక



అక్కు తైక్వాండో జట్టుతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ యూనివర్సిటీ తైక్వాండో జట్టు ఎంపికలు నగరంలోని అన్నవరం సత్యదేవి డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగాయి. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఈ ఎంపికలను ప్రారంభించారు. పురుషులు, మహిళల విభాగంలో జరిగిన ఈ ఎంపికల్లో 46, 49, 53, 57, 62, 67, 73, 73ప్లస్ వెయిట్ కేటగిరీల్లో 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి సీహెచ్ సతీష్, డీఎస్ఏ తైక్వాండో కోచ్ తరుణ్ ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. యూనివర్సిటీ జట్టుకు ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేశారు. ఎంపికలకు యూనివర్సిటీ పరిశీలకుడిగా పీఆర్ కళాశాల పీడీ వర్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీ బి.శ్రీనివాస్ కుమార్, ఏఎస్‌డీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సువర్చల, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎం.వసంతలక్ష్మి, పీడీ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు ప్రక్రియ విజయవంతం చేయండి

ముమ్మిడివరం: ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. బుధవారం స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రైతు సేవా కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు సిబ్బందికి సాంకేతిక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యం తేమ, నూక శాతం కనుగొనే సాంకేతిక పరిజ్ఞానాన్ని టెక్నికల్ సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, అంకితభావంతో రైతుకు కనీస మద్దతు ధరను కల్పించేలా దృష్టి పెట్టాలన్నారు. ఇకపై ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, మిల్లర్ల వద్ద తేమ శాత పరికరాలలో వ్యత్యాసాలు ఉత్పన్నం కావని స్పష్టం చేశారు. జిల్లాలోని 376 రైతు సేవా కేంద్రాలను 219 క్లస్టర్లుగా విభజించినట్టు చెప్పారు. ఆయా క్లస్టర్లలో 219 మంది సాంకేతిక సహాయకులను, 219 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను, 66 మంది హెల్పర్లను నియమించినట్టు వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రాండమైజేషన్ ప్రక్రియను రద్దు చేసినట్టు తెలిపారు. ఇకపై రైతు తమకిష్టం వచ్చిన రైసు మిల్లులకు ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

28న నిధి అప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 28న ఉదయం 9 గంటలకు నిధి అప్‌కే నికట్ డిస్ట్రిక్ట్ అవుట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వైడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లాలో బెండపూడి ఎస్ఎస్ విద్యా విహార్‌లోను, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తాళ్లరేవులోని పీఏసీఎస్(సొసైటీ)లోను, తూర్పు గోదావరి జిల్లాలో జగ్గంపేట దేవి ఫిషరీస్ లిమిటెడ్‌లోను జరుగుతాయని వివరించారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను పింఛనుదారులు ఈ క్యాంపులో సమర్పించవచ్చని తెలిపారు.

భక్త కోటి పులకింత

- రమణీయంగా కోనేటి రాయుడు బ్రహ్మోత్సవాలు
- హనుమద్వాహనంపై కోదండ పాణిగా ఊరేగింపు



హనుమద్వాహనంపై కోదండ పాణిగా ఊరేగుతున్న స్వామి వారు

ఆత్రేయపురం: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కోదండ రాముని అలంకరణలో స్వామివారు హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టు వస్త్రాలు, సర్వాభరణాలతో ముస్తాబైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తజన కోటి తన్మయత్వంతో వేడుకలను తిలకించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధర్‌రావు దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. హనుమద్వాహనంపై కోదండ పాణిగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, అంగరంగ వైభవంగా, మేళతాళాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు.

పూజాది కార్యక్రమాలు

గురువారం ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విశేషార్చన, పారత్మికోపనిషత్ పూర్వక అష్టోత్తర కలశాభిషేకం, లక్ష తులసీపూజ, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమాలు, లక్ష్మీ వేంకటేశ్వర మూల మంత్ర పూర్వక వేంకటేశ్వరహవనం, దిగ్దేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ, కోదండ రామ అలంకరణలో హనుమద్ వాహన సేవ తదితర పూజాది కార్యక్రమాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ ఏర్పాట్లను ఈవో నల్లం సూర్యచక్రధర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



ఆలయంలో నిర్వహిస్తున్న అష్టోత్తర కలశాభిషేకం

హనుమత్ వాహనం విశిష్టత

వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు సాయంత్రం శ్రీరాముని అలంకరంలో శ్రీనివాసుడు హనుమంత వాహనాన్ని అధిరోహించాడు. వాహన సేవను దర్శించడంతో కీర్తి, బుద్ధి లభిస్తాయని ప్రతీతి, అలాగే హనుమంతు వాహనం దర్శించడం వల్ల భూత, ప్రేత, పిశాచాలు దరిచేరవని, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉంటారని భక్తుల విశ్వాసం.

నేటి కార్యక్రమాలు

ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మండప ఆరాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమాలు, అనంతరం యోగ నారసింహ అలంకరణతో సింహ వాహన సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు